సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ♦ 27 ♦ సెప్టెంబర్ ♦ 2024



ఈసారైనా కష్టాలు తప్పేనా..?

బాసరలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాల పనులు మొక్కుబడిగా చేపట్టడంతో భక్తులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు. 8లో▸

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జైపూర్: ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని ముదిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐ రుణాలు, సంపాదిత సెలవుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు చాలా రోజులుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాయకులు సత్తిరెడ్డి, కర్నే నరహరి, టీవీకే ప్రసాద్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

శాంతిభద్రతలు కాపాడాలి



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

లక్సెట్టిపేట: ప్రజల శాంతిభద్రతల కోసం పోలీసులు కృషి చేయాలని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో స్నేహంగా ఉండాలని అన్నారు. ఈ నెల 28న లోక్ అదాలత్ విజయవంతానికి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేందర్, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

జిల్లాలో 17మిల్లీమీటర్ల సగటు వర్షపాతం



వేమనపల్లి: పత్తి పంటలో నిలిచిన నీరు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం నుంచి గురువారం వరకు 17 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మందమర్రి మండలంలో 70.3 మిల్లీమీటర్లు, కాసిపేటలో 31.5, దండేపల్లిలో 26.1, తాండూర్‌లో 27.4, వేమనపల్లిలో 24.4, హాజీపూర్‌లో 16.6, నస్పూర్‌లో 14.5, జన్నారంలో 14.5, జైపూర్‌లో 11.9, లక్సెట్టిపేటలో 11.8, మంచిర్యాలలో 11, భీమినిలో 9.1, కోటపల్లిలో 10, నెన్నెలలో 5.7, కన్నెపల్లిలో 5.6, బెల్లంపల్లిలో 6.4, భీమారంలో 3.7, చెన్నూర్‌లో 3.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 925.6 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా 984.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. జిల్లా సగటున 6 శాతం అధికంగా కురిసింది.

వేమనపల్లిలో భారీ వర్షం

వేమనపల్లి: మండలంలో ఉరుములు, పిడుగులతో బుధవారం అర్ధరాత్రి నుంచి రెండు గంటలకు పైగా భారీ వర్షం కురిసింది. వేమనపల్లి శివారులోని పత్తి చేనులో రెండు పిడుగులు పడ్డాయి. బొగుడగూడంలో సప్పిడె గట్టు ఇంటి ముందున్న విద్యుత్ స్తంభంపై పిడుగు పడింది. దీంతో స్తంభం పెచ్చులూడగా సమీప ఇళ్లలోని కూలర్లు, ఫ్యాన్‌లు, విద్యుత్ మీటర్లు చెడిపోయాయి. నీల్వాయి వాగు, ఎంచపాయవాగు ఉధృతంగా ప్రవహించాయి. చామనపల్లి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామ పంచాయతీతోపాటు బొమ్మెన, నెన్నెల మండలంలోని గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మామడ, నీల్వాయి మధ్యలో ఉన్న ఒర్రె ఉప్పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా రమణ



డాక్టర్ రమణ

మంచిర్యాలటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఈఎన్‌టీ వైద్యుడు రమణ వరుసగా నాలుగో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డాక్టర్ విశ్వేశ్వర్‌రావు, కోశాధికారిగా డాక్టర్ స్వరూపరాణి, ఉపాధ్యక్షులుగా పద్మ, ఎస్.శ్రీనివాస్, ఆర్.రవిప్రసాద్, ఎస్.నవీన్, కళావతి, సంయుక్త కార్యదర్శులు గా ఏ.జ్యోతి, జే.సురేశ్ కుమార్, కుమార్‌గౌడ్, టి.శ్రీలత, రాకేశ్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా కే.లక్ష్మీనారాయణ, సంతోష్, యెగ్గన శ్రీనివా స్, నీలకంఠేశ్వర్‌రావు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులుగా అన్నపూర్ణ, మ ల్లేశ్, శరత్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా చంద్రదత్, ప్రవీణ్‌కుమార్, రాకేశ్‌కుమార్, ఎల్.సురేశ్, శ్రీధర్‌బాబు, ఎంఎస్‌బీఎస్ ప్రసాద్, బొద్దుల రాజేందర్‌లను ఎన్నుకున్నారు.

అక్రమ నిర్మాణదారులకు నోటీసులు



నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

చెన్నూర్: చెన్నూర్ గెర్రెకాలనీలోని 840 సర్వే నంబరు ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణదారులు 34మందికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఆన్‌లైన్ నుంచి ఇంటి నంబర్లు తొలగించామని తెలిపారు. గతంలో నోటీసులు అందుకున్న యజమానులు అందజేసిన దస్తావేజులు అసంపూర్తిగా ఉండడంతో మరోమారు ఇళ్లకు సంబంధించిన పత్రాలతో హాజరు కావాలని సూచించారు. రెండోసారి నోటీసుల జారీతో నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు.

పేకాటరాయుళ్లు!

- ఆటాడేవారిలో ప్రముఖులే అధికం
- సరదా నుంచి వ్యసనంగా మారిన జూదం
- జిల్లా నుంచి గోవాకు ట్రిప్‌గా వెళ్తున్న వైనం
- రూ.లక్షలు కోల్పోతున్నా కానరాని మార్పు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జూద వ్యసనంతో రూ.లక్షలు ఖర్చు పోగొట్టుకుంటున్నా ఆ అలవాటు మాత్రం మానడం లేదు. చట్టవ్యతిరేక పని అని తెలిసినా పేరున్న వ్యక్తుల నుంచి నిరక్షరాస్యుల వరకూ పేకాటను మరువడం లేదు. పోలీసులకు చిక్కకుండా ఎప్పటికప్పుడు రహస్య ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుంటూ ఆట ఆడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో పేకాట క్లబ్‌లు మూసివేసి, ఆంక్షలు అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఇళ్లు, లాడ్జీలు, తోటలు, గోదావరి తీరాలు, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో పత్తాలాటకు వెళ్తున్నారు. అనేక మంది జిల్లా కేంద్రంతోపాటు పలు గ్రామాలు, పట్టణాల్లో జూదమాడుతూ పోలీసులకు చిక్కుతున్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో పేకాటపై విస్తృతంగా తనిఖీలు చేస్తుండడంతో కేసులు నమోదవుతున్నాయి. గతంలో ఓ వ్యక్తిపై ఏకంగా పీడీ యాక్టు ప్రయోగించారు. ఇక పేకాట ఆడేవారే నిర్వాహకుల అవతారమెత్తి ఒక్కో ఆటకు కొంత మొత్తంలో వసూళ్లు చేస్తూ జూదరులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నారు.

రూ.లక్షలతో ఆట

పేకాటలో మైండ్ గేమింగ్‌గా పిలిచే రమ్మీ అనుమతి పొందిన క్లబ్బుల్లో ఆడే వీలుండేది. ప్రస్తుతం నిషేధం అమలులో ఉంది. దీంతో రహస్య ప్రాంతాల్లో రమ్మీతోపాటు తీన్‌పత్తా, కట్‌పత్తా, తదితర ఆటలు ఆడుతూ రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఒక్కో ఆటకు రూ.వేలల్లో పెడుతున్నారు. కొందరు డబ్బులు పూర్తిగా కోల్పోతే అక్కడే అప్పులు తీసుకోవడం, తెలిసిన వారితో ఫోన్ పే, గూగుల్‌పే, ఒంటిపై ఉన్న ఆభరణాలు తాకట్టు పెట్టి మరీ ఆడుతున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ ఆడేస్తూ అనేక కుటుంబాల్లో ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో వ్యసనపరుల్లో వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉంటున్నారు. పేరున్న వ్యాపారులతోపాటు ప్రముఖులుగా ఉండే వారందరూ జూదానికి బానిసలుగా ఉంటున్నారు.

'గోవా'కు వెళ్లి క్యాషినో

ఇక్కడ తరచూ పట్టుబడుతున్నారని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలైన సిరొంచాతోపాటు ఆసిఫాబాద్ జిల్లా వైపు రాజూరా, పోడ్సా, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల దాకా వెళ్లేవారు. అక్కడ కూడా అనధికార క్లబ్బులపై తనిఖీలు జరగడంతో 'ఆటలు' సాగడం లేదు. దీంతో ఏకంగా ఆసక్తి ఉన్న వారిని గోవాకు తీసుకెళ్తున్నారు. విమానాల్లో టికెట్లు బుకింగ్ చేస్తున్నారు. ఎంపిక చేసుకున్న ఏజెంట్లతో ప్రతీ నెలకోసారి జిల్లా నుంచి గ్రూప్‌ల వారీగా క్యాషినో ఆడేందుకు వెళ్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సెలవు దినాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉంటున్నారు. దసరా సెలవుల్లో కొందరు టీచర్లు, ఉద్యోగస్తులు గోవా ట్రిప్ బుకింగ్ చేసుకున్నట్లు సమాచారం. అక్కడికి వెళ్లిన వారిలో ఎక్కువ మంది రూ.లక్షలు పోగొట్టుకుని ఖాళీ చేతులతో వస్తున్నారు. ఇప్పటికే చాలామంది రియల్ వ్యాపారస్తులకు ఈ అలవాటు కారణంగా అప్పుల పాలైన వాళ్లూ ఉన్నారు.

జిల్లాలో ఈ ఏడాది నమోదైన కేసులు

పేకాట 44	కోడిపందేలు 01
మట్కా 01	ఆన్‌లైన్ జూదం 01
పట్టుబడిన వ్యక్తులు 322మంది	
స్వాధీనం చేసుకున్న మొత్తం రూ. 23,42,340	

కఠిన చర్యలు తీసుకుంటున్నాం



జూదమాడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. వారిని బైండోవర్ చేయడం, ఏడాది నుంచి ఏడేళ్ల వరకు శిక్ష పడేలా సెక్షన్లు ప్రయోగిస్తున్నాం. వ్యవస్థీకృతంగా పేకాట స్థావరాలుగా మారిన ఇళ్లు, లాడ్జీలు, కార్యాలయాలను సీజ్ చేసేలా చర్యలు చేపడుతున్నాం.

– ఏ.భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

ఎన్నికల వాహనాల బిల్లులేవి..!

- వాహనాలు సమకూర్చిన ఆర్టీఏ
- పార్లమెంటు ఎన్నికల్లో వినియోగం
- నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణ



ఈవీఎంల కోసం భారీ వాహనాలు(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు సామగ్రి, సిబ్బందిని తరలించేందుకు వినియోగించిన వాహనాలకు బిల్లులు ఇంకా రాలేదు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో వాహన యజమానులు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో అప్పటి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ) ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, టాటా ఏస్‌లు, ఆటోలు సమకూర్చారు. ఈ ఏడాది మే 13న పార్లమెంటు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తంగా 98రూట్లకు గాను రెండు రోజులపాటు వాహనాలు కేటాయించారు. ఎన్నికల కోడ్ అమలు చేసేలా ఎన్నికల అధికారులకు ఓ వంద కార్లు కూడా సమకూర్చారు. మండల, గ్రామ స్థాయిలో ఎన్నికల ఉద్యోగులు, సిబ్బంది, సామగ్రి తరలింపునకు వివిధ రకాల వాహనాలతోపాటు దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆటోలు, ఈవీఎంలు, వీవీపాట్ల తరలింపునకు భారీ వాహనాలు మొత్తంగా 215 వాహనాలు వినియోగించారు. ఇందులో 91ఆర్టీసీ బస్సులు పోను మిగతా 124 వాహనాల బిల్లులు రావాల్సి ఉంది.

దివ్యాంగులకు ఆటోలు

వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి అక్కడి నుంచి ఇంట్లో దింపేందుకు మొత్తంగా 492 ఆటోలు సమకూర్చారు. జిల్లాలోని ఏడు మున్సిపాల్టీలకు 150 ఆటోలు, 310 పంచాయతీల్లోని గ్రామీణ ప్రాంతాలకు 350 ఆటోలు కేటాయించారు.

రూ.20లక్షలు..

విద్యాసంస్థల బస్సులు, టాటాఏస్‌లు, ఆటోల యజమానులు బిల్లుల కోసం రోజూ కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇప్పటికీ బిల్లులు రాకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో వాహనాల ఎలా సమకూరుస్తామని ప్రశ్నిస్తున్నారు. రెండ్రోజులకు 101 ప్రైవేటు బస్సులకు రూ.8లక్షలు, డ్రైవర్ల బత్తా రూ.1.05లక్షలు, క్లీనర్లకు రూ.78,780, 19టాటాఏస్‌లకు రూ.28,600, 492 ఆటోలకు రూ.5,90,400 చెల్లించాల్సి ఉంది. ఎన్నికల అధికారులకు వారం రోజుల నుంచి నెల రోజుల వరకు కార్లు అందుబాటులో ఉంచారు. మొత్తం వంద కార్లకు రోజుకు రూ.1,430 చొప్పున అంటే దాదాపు రూ.లక్షల్లో ఇంకా బిల్లులు రాలేదు.

బిల్లులు ఇస్తలేరు..




గత అసెంబ్లీ ఎన్నికల బిల్లు దేవుడెరుగు.. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో అద్దెకు పెట్టిన వాహనాల బిల్లులు రావడం లేదు. నెలల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల కమిషన్ బిల్లు ఇచ్చిందా లేదా తెలియడం లేదు. కలెక్టర్‌తోపాటు ఎన్నికల అధికారులు అంతా బదిలీలు అయ్యారు. మా బిల్లులు ఎవరిస్తారో తెలియడం లేదు. రోజూ వస్తున్నాం.

– మనోహర్, మందమర్రి, వాహన యజమాని

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త్

- లోపాల గుర్తింపునకు ప్రత్యేకయాప్
- రెండు విభాగాలుగా వివరాల నమోదు



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీ

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో శారీరక, మానసిక వికలత్వంతోపాటు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలు ఉంటే వారి వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ఇందుకోసం ఎస్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా ప్రశస్త్ యాప్‌ను రూపొందించింది. ఉపాధ్యాయులు నేరుగా విద్యార్థులను పరిశీలించి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. సమస్యలుంటే విద్యార్థులకు ఉన్నతస్థాయి వైద్యం అందేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ నెల 23న మండలాల వారీగా ప్రధానోపాధ్యాయులకు ఆర్పీలు శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎంలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణ పొందిన వారంతా ఆయా పాఠశాలల్లో పిల్లల వివరాలు నమోదు చేయనున్నారు. గురువారం నుంచి యాప్‌లో వివరాల నమోదు కార్యక్రమం ప్రారంభమైంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 1090 పాఠశాలలు ఉండగా 1,22,847 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేరు, సర్వీస్ నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి నంబరు, యుడైస్‌కోడ్‌తో లాగిన్ కావాల్సి ఉంటుంది. ప్రశస్త్ యాప్‌లో పొందుపరిచిన విధంగా కొన్ని ప్రశ్నలు పిల్లలను అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇంకొన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలి.

పార్ట్–1: ఈ నెల 26నుంచి అక్టోబర్ 26వరకు కొనసాగుతుంది. యాప్‌లో 64 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బోధన సమయంలో పరిశీలించాల్సి ఉంటుంది. సరిగా చూస్తున్నాడా.. చదువుతున్నాడా..? అవయలోపం ఏముంది..? వినికిడి లోపం ఉందా..? అర్థం చేసుకుంటున్నాడా..? అన్ని విషయాలు గమనించి నమోదు చేయాల్సి ఉంది. మొదటి రోజు గురువారం కొన్ని పాఠశాలల్లో ప్రారంభమైనా నమోదులో సాంకేతిక కారణాల వల్ల నత్తనడకన సాగినట్లు తెలుస్తోంది.

పార్ట్–2: అక్టోబర్ 27నుంచి నవంబర్ 14 వరకు కొనసాగిస్తారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న విద్యార్థుల వివరాలు నమోదు చేయనున్నారు. లోపాలను గుర్తించి వైద్యులకు సిఫార్సు చేయడంతో చికిత్స అందిస్తారు.

పకడ్బందీగా అమలు

ప్రశస్త్ యాప్ అమలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. యాప్‌పై శిక్షణ పూర్తి చేశాం. వివరాలు పక్కాగా నమోదయ్యేలా చూస్తాం. ఉపాధ్యాయుడు బోధన చేస్తూ నెలరోజుల పాటు ప్రతీ విద్యార్థిని స్క్రీనింగ్ చేస్తారు. మొదటి రోజు యాప్‌లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. అన్నింటిని పరిష్కరిస్తూ పూర్తి వివరాల నమోదుకు చర్యలు చేపట్టాం.

– యాదయ్య, డీఈవో

ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



కమాండెంట్ వెంకటరాములు, అధికారులు

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, రజక సంఘాల నాయకులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తికి సాగుతున్న పోరులో ఐలమ్మ చేరికతో భూమి కోసం భుక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటంగా రూపుదాల్చిందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, దేశ్‌ముఖ్‌ను ఎదురించిన వైనం మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి బాపు, రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశం, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ టి.కాళిదాస్, పోలీస్ అధికారులు, సిబ్బంది పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ వెంకటరాములు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

ఇసుక రీచ్‌లను గుర్తించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో ఇసుక రీచ్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో మైనింగ్, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర అధికారులతో ఇసుక రీచ్‌ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లు వర్షాల కారణంగా నిలిపి వేసినట్లు తెలిపారు. జిల్లాలో నూతన ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

కేవీ భవన నిర్మాణం పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో కేంద్రియ విద్యాలయం(కేవీ) భవన నిర్మాణ పనులను కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య, క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం అందుతుందని అన్నారు. రూ.26 కోట్లపై చిలుకు నిధులతో సాగుతున్న భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ జక్కుల ప్రసాద్ పాల్గొన్నారు.

కవ్వాల్‌లో పులి కదలికలు

- ఇందన్‌పల్లి రేంజ్‌లో అడుగులు
- అటవీశాఖ కెమెరాకు చిక్కినట్లు సమాచారం
- గోప్యంగా ఉంచుతున్న అధికారులు



ఇందన్‌పల్లి రేంజ్‌లో కనిపించిన పులి అడుగులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పులి మకాం వేసింది. గత నెల రోజుల క్రితం జన్నారం రేంజ్‌లోని జువ్విగూడలోని రైతుకు చెందిన రెండు పశువులపై దాడి చేసిన పులి అప్పటి నుంచి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సంచరిస్తోంది. నెల రోజుల క్రితం అటవీ అధికారులు పులి అడుగులను గుర్తించి సంచారాన్ని నిర్ధారించారు. గురువారం ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో వర్షం కురిసిన అనంతరం ఓ వాగులో తిరిగినట్లు అడుగులను గుర్తించారు. పశువుల కాపరులు సైతం పులి అడుగులను గుర్తించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

అధికారుల నిఘా

పులి సంచారం దృష్ట్యా అటవీశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయమే సిబ్బంది జట్లుగా అడవుల్లోకి వెళ్లి పులి ఆనవాళ్లను గుర్తిస్తూ ఎటువైపు వెళ్తుందో గుర్తిస్తున్నారు. ఇందన్‌పల్లి, జన్నారం అటవీ రేంజ్‌లలో కెమెరాలు అమర్చారు. ఈ కెమెరాలకు పులి చిక్కినట్లు తెలిసింది. ఈ విషయాన్ని అటవీ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. అడుగులు, గీరికలు గుర్తిస్తూ పులి ఎటువైపు వెళ్తుందో గమనిస్తూ ఎలాంటి ఆపద రాకుండా రాత్రీపగలు నిఘా వేస్తున్నారు. ఆయా రేంజ్‌ల పరిధిలో రాత్రి, పగలు అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు పర్యటిస్తున్నారు. పులి సంచారంపై డివిజన్ అధికారులు ఉన్నత అధికారులు, ఎన్‌టీసీఏ అధికారులకు సమచారం చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. నెల రోజులుగా పులి సంచరిస్తున్న విధానంతో ఇక్కడ అనువైన చోటు ఏర్పాటు చేసుకుని తన కుటుంబంతో తిరిగి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

పశువుల కాపరుల బెంబేలు

ఇందన్‌పల్లి రేంజ్‌లోని ఓ వాగులో పశువులు మేపడానికి వెళ్లిన గిరిజనులు పులి అడుగులను గుర్తించారు. వర్షం తగ్గిన తర్వాత వాగు ఇసుకలో పెద్ద అడుగులు కనిపించాయి. పక్కనే గల వాగు ఒడ్డున బురదలో అడుగులు పడడంతో గురువారం ఈ ప్రాంతంలో తిరిగినట్లు పశువుల కాపరులు చెబుతున్నారు. భయంతో పరుగులు తీసినట్లు తెలిపారు.

డివిజన్‌లో పర్యటిస్తోంది..

పులి జన్నారం అటవీ డివిజన్ పరిధిలో సంచరిస్తున్న మాట వాస్తవమే. ఆనవాళ్లు గుర్తించాం. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పులి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నాం. సమీప గ్రామాల ప్రజలు ఏదైనా విషయం తెలిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. – శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

చదువుతోనే సమాజంలో గుర్తింపు

- చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి రవి



భీమారంలో అవగాహన కల్పిస్తున్న జడ్జి రవి

భీమారం: చదువుకుంటేనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెన్నూరు సివిల్ కోర్టు జడ్జి పర్వతపు రవి అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం సాయంత్రం మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులకు న్యాయస్థానాలతోపాటు చట్టాలపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి చట్టాల గురించి తెలుసుకోవాలని, రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై భూమన్న, ప్రత్యేక అధికారి కనకలక్ష్మి, చెన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్ గిల్డా, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడాపోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) జోనల్ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. అండర్–14, 17 విభాగంలో జోనల్‌స్థాయి(ఉమ్మడి జిల్లా)లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జోనల్ స్థాయి పోటీల వేదికలను ఖరారు చేసినట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. పోటీల తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. కార్మెల్ స్కూల్(మంచిర్యాల)లో బాస్కెట్‌బాల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్(మందమర్రి)లో చెస్, మదర్ థెరిసా స్కూ ల్(లక్సెట్టిపేట)లో రెజ్లింగ్, హెవెన్ ఆఫ్ హోప్ (బొక్కలగుట్ట)లో ఫుటల్‌బాల్, ఆదిత్య హైస్కూల్(తీగల్‌పహాడ్)లో కరాటే, జెడ్పీఎస్‌ఎస్(తాళ్లపేట్)లో వాలీబాల్ అండర్–14 పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

రేపు హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 28న జైపూర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల(బాలుర)లో అండర్–17 జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. క్రీడాకారులు ధ్రువపత్రాలతో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరి ఫణిరాజా, పోటీల కన్వీనర్ నాగేశ్వరావ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన వృద్ధుడు మృతి


అలిశెట్టి విఠల్ (ఫైల్)

ముథోల్:బాసర మండలం కిర్గుల్ గ్రామానికి చెందిన అలిశెట్టి విఠల్ (61) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని ఎస్సై సాయికిరణ్ తెలిపారు. విఠల్ బుధవారం తానూరు మండలం నంద్గాం గ్రామానికి బంధువుల అంత్యక్రియల కోసం వెళ్లాడు. ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ముథోల్ మండలం జళశంకర్ మూలమలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో విఠల్‌కు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విఠల్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

డివైడర్‌కు ఢీకొని రిటైర్డ్ కార్మికుడి మృతి


లక్ష్మారెడ్డి (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని కలెక్టరేట్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో నివాసం ఉండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పొరెడ్డి లక్ష్మారెడ్డి(67) లారీ ట్రాన్స్‌పోర్ట్ సంఘంలో సభ్యుడిగా ఉన్నాడు. సంఘం పని నిమిత్తం మధ్యాహ్నం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో కలెక్టరేట్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు రైల్వే కాంట్రాక్ట్ కార్మికుడు మృతి


మృతుడు సత్యనారాయణ(ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి వద్ద కాంట్రాక్ట్ కార్మికుడు ఆకారపు సత్యనారాయణ పటేల్ పాము కాటుకు గురై మృతిచెందాడు. జీఆర్‌పీ ఎస్సై మహేందర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ కొంత కాలంగా రైల్వేబ్రిడ్జి వద్ద కోల్‌కతాకు చెందిన కాంట్రాక్టర్ షెడ్డుకు తాత్కాలిక వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా పాము కాటేసింది. విధుల్లో ఉన్న మరో ఉద్యోగి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం సత్యనారాయణ పటేల్(55) చనిపోయాడు. ఆయనకు భార్య భారతి, కూతురు సుస్మిత ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళనకు యత్నించారు. కాంట్రాక్టర్ స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో భద్రపర్చారు. కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీ ఎస్సై తెలిపారు.

ఈసారైనా కష్టాలు తప్పేనా?

- అక్టోబర్ 3 నుంచి నవరాత్రి ఉత్సవాలు
- సమస్యలపై పూర్తిస్థాయి దృష్టి పెట్టాలి


నిర్మాణాలు పూర్తికాక నిలిచిన నీరు


బాసరలోని క్యూలైన్‌లు

భైంసా/బాసర: బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ఉత్సవాల్లో దసరా నవరాత్రులు ప్రధానమైనవి. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి భక్తులు పోటెత్తుతారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మూలనక్షత్రం రోజు లక్షల్లోనే భక్తులు ఇక్కడికి తరలివస్తారు. కానీ ఏటా ఉత్సవాల్లో చేపట్టే పనులన్నీ మొక్కుబడిగా ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రధానంగా తాగునీరు కూడా దొరకడంలేదు. ఆలయానికి కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా భక్తులకు వసతులు కల్పించడంలో మాత్రం అధికారులు దృష్టి సారించడంలేదు.

మరో వారం రోజుల్లోనే...

వచ్చేనెల 3 నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు ఆలయ అధికారులు ఉత్సవాల నిర్వహణపై ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదు. ప్రసాదం తయారీ కేంద్రం నుంచి ప్రత్యేక క్యూలైన్‌లు మాత్రం నిర్మిస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా...

బాసర ఆలయ గర్భగుడికి ఎదురుగా ఏళ్ల క్రితమే స్వాగతతోరణం నిర్మించారు. తోరణానికి ముందు ఆలయానికి వెళ్లే మార్గంలో క్యూలైన్‌లు నిర్మించేందుకు పది అడుగులమేర గోతులు తవ్వి పనులు చేపట్టకుండానే వదిలేశారు. వర్షం కురిసినప్పుడల్లా అందులో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పైగా ఈ ప్రదేశం క్యూలైన్‌ను ఆనుకుని ఉంది. ఇక్కడ నిలిచే నీటి నుంచి వచ్చే దోమలు భక్తులను ఇబ్బందులు పెట్టే ప్రమాదం ఉంది. ఈ ప్రదేశాన్ని అప్పటివరకు మూసివేయడమో... నిర్మాణాలు పూర్తి చేయడమో చేయాల్సి ఉంది.

దీక్షాపరుల కోసం...

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాసరలో అమ్మవారి దీక్షాపరుల సంఖ్య పెరుగుతుంది. ఏటా దీక్షాపరులంతా తొమ్మిది రోజులపాటు ఆలయంలోనే ఉండి సేవలు అందిస్తారు. సాయంత్రం, సంధ్యా కాలంలో స్నానాలు చేసి తెల్లని వస్త్రాలు ధరించి దీక్షలు పూర్తి చేస్తారు. ఎంతో మంది పాదయాత్రగా బాసరకు వస్తారు. దీక్షాపరులు, పాదయాత్రగా వచ్చే భక్తుల కోసం బాసర ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

- నవరాత్రి ఉత్సవాల్లో బాసర ఆలయంలో అక్షరశ్రీకార పూజలు జరిపే మండపాల సంఖ్య పెంచాలి.

ఇలా చేస్తే మేలు..

- భక్తుల రద్దీకి అనుగుణంగా వైదిక సిబ్బందిని పెంచి త్వరితగతిన అక్షరాభ్యాసాలు జరిగేలా చూడాలి.
- క్యూలైన్‌లో ఆలయం తరపున భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్లు అందేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రధాన కూడళ్లలో విద్యుత్‌లైట్లు బిగించాలి.
- ఆలయానికి దూరంగా పార్కింగ్ సౌకర్యం కల్పిస్తుండడంతో అక్కడి నుంచి వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు నడిచి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. పార్కింగ్ స్థలం నుంచి వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి.
- భక్తులు వెళ్లే క్యూలైన్‌లలో అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేలా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.
- ఆలయ ప్రాంగణం, ప్రధాన ద్వారం, క్యూలైన్‌లు గోదావరి ఘాట్ వద్ద తాగునీరందించాలి. గంటల తరబడి క్యూలో నిరీక్షించే భక్తులకు ఉప్మా, పులిహోర, అరటిపండ్లు అందించాలి.
- ఆలయం వరకు బస్సులు ఏర్పాటు చేయాలి. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు నిజామాబాద్, భైంసా నుంచి ప్రత్యేక బస్సులు నడపాలి.
- రైల్వేస్టేషన్, గోదావరి ఘాట్, అమ్మవారి ఆలయం వద్ద ఉచిత బస్సు తొమ్మిది రోజుల పాటు నిరంతరాయంగా నడిచేలా చర్యలు తీసుకోవాలి.
- అన్నదానసత్రంతో పాటు మరికొన్ని చోట్ల అన్నదానం ఏర్పాట్లు చేయాలి. ప్రసాదాలు, టికెట్ల కౌంటర్లను పెంచాలి. ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

జైనూర్ ఘటనకు రాజకీయరంగు పూయవద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: జైనూర్ ఘటనకు రాజకీయ రంగు పూయవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో శాంతి వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇరువర్గాలతో చర్చించారన్నారు. హైదరాబాద్‌లో ఘటన వివరాలను సీఎం, గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన సీఎం..హైదరాబాద్‌లో వారం రోజుల్లో ఆదివాసీలతో సమావేశమవుతామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.

జైనూర్ ఘటనలో 22 మందికి బెయిల్

ఆసిఫాబాద్: జైనూర్ మండలంలో జరిగిన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. గురువారం 22 మందికి ఆసిఫాబాద్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 4న జరిగిన హింసాత్మక సంఘటనల్లో జైనూర్ మండల కేంద్రంలోని పలు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ క్రమంలో సుమారు 60 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులుగా 26 మందిని కరీంనగర్ జైలుకు తరలించారు. నిందితుల్లో 22 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. వారు జైలు నుంచి విడుదలయ్యారని న్యాయవాది సతీశ్‌బాబు తెలిపారు.

లాభాలపై తప్పుడు ప్రచారం

- ఆధారాలతో సహా చర్చకు సిద్ధం
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వీ.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: కంపెనీ సాధించిన లాభాలు, కార్మికులకు చెల్లించే వాటాపై కొందరు కార్మిక సంఘాల నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య అన్నారు. గురువారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. లాభాలు ఎలా లెక్కించారు, అందులో వాటా ఏ మొత్తం నుంచి ఇచ్చారో వివరించారు. 2009-10 నుంచి సంస్థకు వచ్చిన లాభాలు, పెట్టుబడుల వివరాలు, వాటా శాతం వివరాలను వివరించారు. ప్రతీసారి మొత్తం లాభాల నుంచి కొంత సంస్థ విస్తరణ, పెట్టుబడులకు కేటాయించిన తర్వాత లాభాలను చూపి అందులో నుంచి వాటా చెల్లిస్తుంటారని తెలిపారు. దీనిపై తాము ఏ చర్చకైనా సిద్ధమే అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరి కే.వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, నాయకులు గండి సతీష్, మారేపల్లి బాపు, నవీన్‌రెడ్డి, అఫ్రోజ్‌ఖాన్, సురేష్, సదానందం, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి’


గనిపై మాట్లాడుతున్న మంద నర్సింహారావు

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.30 వేల కోట్లు వెంటనే చెల్లించాలని సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆర్కే 7 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులతో మాట్లాడారు. అనంతరం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పెట్టుబడుల పేరుతో లాభాల్లో కోత విధించడం కంటే బకాయిలను వసూలు చేస్తే పెట్టుబడులకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఏఐటీయూసీని గెలిపిస్తే అన్యాయమే చేస్తున్నారని, లాభాల వాటాపై వారి వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ జిల్లా కార్యదర్శి సంకె రవి, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి అంబాల శ్రీనివాస్, అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్జీ 2 ఏరియా కార్యదర్శి ప్రవీణ్, నాయకులు నరహరి, వెంగళ శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, నవీన్, అనిల్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్ల బండి

- రెండు ఎడ్లు, లేగదూడ మృతి


ఎద్దును పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శ్రీకర్

సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం తాండ్ర(జి) గ్రామ సమీపంలోని తుమ్మల వాగులో బుధవారం సాయంత్రం ఎడ్లబండి కొట్టుకుపోయింది. గ్రామానికి చెందిన రైతు జాదవ్ అరవింద్ బుధవారం ఉదయం వ్యవసాయ పనులకు వాగు అవతల ఉన్న చేను వద్దకు ఎడ్ల బండిలో వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో భారీ వర్షం కురిసింది. దీంతో తుమ్మల వాగులో ప్రవాహం పెరిగింది. ప్రవాహాన్ని అంచనా వేయకుండా రైతు అరవింద్ వాగులో నుంచి ఎడ్ల బండిని పోనిచ్చారు. అయితే వరద ఉధృతికి ఎద్దులు, లేగదూడతో సహా కొట్టుకుపోయింది. ప్రమాదం గమనించిన రైతు చెట్టు కొమ్మను పట్టుకుని బయటపడ్డాడు. వరద ఉధృతికి ఎద్దులు, లేగదూడ నీట మునిగి ఊపిరాడక మృతిచెందాయి. గురువారం ఉదయం వాటి కళేబరాలు లభ్యమయ్యాయి. బాధిత రైతులు మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం తరపున సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ ఈవో

భైంసాటౌన్:బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించే శారదీయ శరన్నవరాత్రోత్సవాలకు రావాలని వ్యవస్థాపక వంశీయులు శరత్‌పాఠక్, ఈవో విజయరామారావు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్‌ను కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కండక్టర్‌పై దాడి

భీమారం: కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భీమారం ఎస్సై బి.రాములు తెలిపారు. సిరొంచకు వెళ్లిన ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి మంచిర్యాల డిపోకు వెళ్తుండగా వేమనపల్లికి చెందిన సిడం మహేష్ చెన్నూర్‌లో ఎక్కాడని తెలిపారు. మద్యంమత్తులో తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడాన్ని గమనించిన కండక్టర్ జి.భాస్కర్ అతడిని వారించే ప్రయత్నం చేయగా భీమారం సమీపంలో రాగానే దాడి చేశాడని తెలిపారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రేమపేరిట మోసం.. గర్భం దాల్చిన యువతి

తలమడుగు: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని యువకుడు యువతిని మోసం చేసి గర్భవతి చేయగా ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువతిని ఓ గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకుడు గత రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి గర్భవతిని చేశాడు. ఆమె గర్భందాల్చి రిమ్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. తీరా పెళ్లి విషయమై అడుగగా నిరాకరించడంతో యువతి గురువారం తలమడుగు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

వివాహితపై లైంగికదాడి

కుభీర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై గురువారం మధ్యాహ్నం జాదవ్ సాహెబ్‌రావ్ లైంగికదాడి చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన సాహెబ్‌రావు లోపలికి చొరబడి లైంగికదాడి చేశాడు. బాధితురాలు స్పృహ కోల్పోగానే పారిపోయాడు. కాసేపటి తర్వాత బాధితురాలి మరదలు వచ్చి చూడగా ఇల్లంతా చిందరవందరగా ఉంది. బాధితురాలిని లేపగా జరిగిన విషయం చెప్పింది. తర్వాత భర్తకు ఫోన్‌చేసి జరిగిన విషయం తెలిపింది. దీంతో భర్త ఇంటికి వచ్చి పోలీస్‌స్టేషన్‌కు జాదవ్ సాహెబ్‌రావుపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని బాధితురాలిని భైంసా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

చదువుకున్న బడిలోనే..ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న సంగీత

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుకున్న కౌఠ(బి) గ్రామానికి చెందిన జి.సంగీత.. ఆ బడిలో గురువారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన స్వర్ణలత బదిలీపై మెదక్ జిల్లాకు వెళ్లారు. కాగజ్‌నగర్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన సంగీత బదిలీపై గత జూలైలో టీజీటీ గణిత ఉపాధ్యాయురాలిగా ఇక్కడకు వచ్చారు. కాగా, ఆమెకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగిస్తూ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. తాను ఐదు నుంచి పదో తరగతి చదివిన బడిలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించడం అదృష్టంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. లెక్చరర్ రవికుమార్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ లత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సూపరింటెండెంట్ అర్చన, సీనియర్ అసిస్టెంట్ చరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎఫ్ఆర్‌వో

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలో జిల్లేడుకుంట అటవీప్రాంతంలో ఓ వ్యక్తిపై ఎలుగుబంటి దాడిచేసింది. గ్రామానికి చెందిన రైతు తొడసం సోనేరావు తన ఆవు తప్పిపోవడంతో దానిని వెతికేందుకు గ్రామానికి చెందిన భీంరావు, అమృత్‌రావుతో కలిసి అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో పిల్లతో ఉన్న ఎలుగుబంటి సోనేరావుపై దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న రైతులు కేకలు వేయడంతో ఎలుగుబంటి వెళ్లిపోయింది. వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు రెఫర్ చేశారు. ఎఫ్ఆర్‌వో కిరణ్ ఆస్పత్రికి చేరుకుని కుటుంబీకులను పరామర్శించారు. అటవీశాఖ తరపున మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షతగాత్రుడికి ప్రాణాపాయం తప్పిందని, కుటుంబీకులు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

పగిలిన భగీరథ పైప్


భారీగా బయటకు వస్తున్న నీరు


బైక్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో గురువారం మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలింది. దీంతో భారీగా నీరు వృథాగా పోయింది. దేవాపూర్ నుంచి సుంకిడి గ్రామ సమీపంలో సంప్‌లోకి ఈ పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. పొన్నారిలో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు చేరడంతో గుంత ఏర్పడింది. ఈ పక్కనే రెండు బైక్‌లు నిలిపి ఉంచగా, భారీగా నీరు చేరి మునిగింది. ఒక బైక్‌ను బయటకు తీయగా, మరో బైక్ గంటకు పైగా నీటిలో ఉండిపోయింది. నీటిప్రవాహం తగ్గాక ఆశన్నకు చెందిన బైక్‌ను స్థానికులు తాళ్ల సాయంతో బయటకు తీశారు. కాగా, పక్కన హోటల్‌లోకి భగీరథ నీరు వెళ్లడంతో సామగ్రితోపాటు రిఫ్రిజిరేటర్ పూర్తిగా చెడిపోయింది.

‘కడెం’ గేటు ఎత్తివేత

కడెం: కడెం ప్రాజెక్టుకు గురువారం రాత్రి 5,080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,179 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 700 అడుగులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పాముకాటుకు ఎద్దు మృతి

నార్నూర్(గాదిగూడ): గాదిగూడ మండలం కొలామ గ్రామంలో పాముకాటుకు ఎద్దు మృతి చెందింది. గురువారం ఉదయం రైతు మందాడి చిత్రు తన ఎద్దులను పొలం వద్ద ఓ చెట్టుకు కట్టేశాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా ఒక ఎద్దు చనిపోయి ఉంది. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి

లోకేశ్వరం: విద్యార్థులు కళాశాల తరగతులకు హాజరయ్యేలా చూడాలని డీఐఈవో పరశురాం నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. హాజరు శాతం పెంచాలన్నారు. పాఠ్య ప్రణాళి ప్రకారం విద్యాబోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు వినోద్, విఠల్, చిన్నయ్య, మహేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, హరీశ్ ఉన్నారు.

గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

నెన్నెల: నెన్నెల శివారులోని చెరువు సమీపంలో గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది యువకులను గురువారం అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్‌తో కలిసి బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కొందరు యువకులు చెరువు వద్ద గంజాయి సేవిస్తున్నారని అందిన సమాచారం మేరకు నెన్నెల ఎస్సై వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నించారని చెప్పారు. తాళ్లగురిజాలకు చెందిన మహ్మద్ ముస్తాఫా గంజాయిని విక్రయించేందుకు రాగా అతడి వద్ద రూ.3,750 విలువైన 169 గ్రాముల గంజాయి లభించిందని తెలిపారు. వారి నుంచి గంజాయి ప్యాకెట్‌తోపాటు నాలుగు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముస్తాఫాతోపాటు నెన్నెల మండలం గన్‌పూర్‌కు చెందిన పోతరాజుల ఆకాష్, కన్నెపల్లి మండలం చర్లపల్లికి చెందిన శనిగారపు వినోద్, బెల్లంపల్లి మండలం దుగినేపల్లికి చెందిన జాడి సుందర్, చల్లూరి రమాకాంత్, నెన్నెలకు చెందిన దుర్గం స్వామి, పిట్ట శేఖర్, గుండ్లసోమారానికి చెందిన రత్నం దేవేందర్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు. బెల్లంపల్లికి చెందిన జమీల్ పరారీలో ఉన్నాడని వివరించారు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులో మేర సంజీవ్‌పై ఈ నెల 23న జరిగిన దాడి కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ గురువారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గడప రాకేష్, మేర సంజీవ్ రెండు వర్గాలుగా ఏర్పడి ఉనికిని చాటుకునేందుకు దాడులు చేసుకుంటున్నారు. గతంలో రాకేష్ వర్గం సంజీవ్‌పై దాడి చేసింది. దీంతో సంజీవ్ అనుచరులతో కలిసి ఈ ఏడాది జూన్ 2న రాకేష్‌పై దాడి చేసి గాయపర్చారు. రాకేష్ వర్గం సంజీవ్ హత్యకు గద్దెరాగడి సమీపంలోని తిమ్మాపూర్‌కు చెందిన పులగం నగేష్ ఇంట్లో పథకం వేసుకున్నారు. మందమర్రి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన పోచంపల్లి సంపత్, విశాల్ అనుచరులు 11మందితో కలిసి ఈ నెల 23న సంజీవ్‌పై దాడి చేశారు. దీంతో సంజీవ్‌తోపాటు తోటమాలి అబ్దుల్ అఫ్రోజ్, వాచ్‌మెన్ దోమల శంకరయ్య గాయపడ్డారు. ప్రతిగా వీరు చేసిన దాడిలో రుద్రతేజ్, జ్ఞానేశ్వర్‌లకు గాయాలయ్యాయి. ఈ కేసులో 19మంది హస్తం ఉన్నట్లు తేలిందని, స్థానిక జాఫర్‌నగర్‌కు చెందిన కుంట శ్రీధర్, ఎస్‌కే అబ్దుల్ రసూల్, తిలక్‌నగర్‌కు చెందిన ఎండీ.అన్వర్, జుమ్మాడ పున్నం, తిమ్మాపూర్‌కు చెందిన పులగం నాగేష్‌లను అరెస్టు చేసినట్లు ఏసీపీ వివరించారు. మరో 14మంది పరారీలో ఉన్నారని తెలిపారు. సమావేశంలో సీఐ బన్సిలాల్, ఎస్సై సనత్‌కుమార్ పాల్గొన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

భీమిని: మండల కేంద్రానికి చెందిన కల్యాణం మల్లేష్(45) గురువారం మృతిచెందాడు. కటింగ్ కోసం మామిడిపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మద్యం సేవించి ఉండడంతో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందినట్లు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య కమల, కూతురు స్వాతి, కుమారుడు రాకేష్ ఉన్నారు.